# ఏది తప్పు?

(జాగృతి ప్రత్యేక సంచిక 17-5-74)

---

శీలం కోల్పోయి భారతీయ సాంప్రదాయాన్ని మలిన పరిచిన ఆడపిల్లది తప్పయినప్పుడు మనవడిని కనివ్వని కోడలితో కాపురం చేయడానికి వీలులేదని కొడుకుని శాసించడం తల్లిది తప్పుకాదా?

—జయప్రద

---

"విరా కోడలికి నెలలు లాగున్నాయి. పాపం ఈసారన్నా మగ పిల్లాడు పుడ్తే...."

"ఆఁ ఏం పుడతాడో ఈసారి ఆడపిల్లను కంటే మాత్రం—మా వాడికి మళ్ళీ పెళ్ళిచేసేస్తాం మీనాక్షమ్మా."

"అయినా పాపం, నీ కోరిక తీరడమేలేదు. మీ కోడలి వంశమే అంతలే వర్ధనమ్మా"

"వంశమో పాడో ఈసారి అడపిల్లను కంటే మాత్రం ఈ గడప తొక్కనిచ్చేది లేదు.

ప్రక్కింటి మీనాక్షమ్మతో, తన అత్తగారు తన గురించి అనడం విన్న ప్రమీల గుండెలనిండా విచారం గూడు కట్టుకుంది.

"బాధపడబాకు. మగపిల్లాడే పుడతాడులే" చేతిలో కరివేపాకుతో మీనాక్షమ్మ వెళ్ళిపోతోంది. అటే వస్తున్న ప్రమీల మరో అడుగుకూడా వేసే శక్తిలేనిదానిలా అక్కడే కూలబడిపోయింది.

అలా కూలబడ్డ ప్రమీలలో తనీజన్మలో ఓ మగబిడ్డకు తల్లి కాలే ననే అపనమ్మకం చోటు చేసుకోసాగింది. ఆ అపనమ్మకం ప్రక్కనే ఆపుకోలేనంత కోరిక.

ఎవరయినాసరే, ఈ ఇంట్లో ఒక్కరు....ఒక్కరంటే ఒక్కరు వచ్చి తన తలమీద ఆదరంగా చెయ్యివేసి బాధపడకు ప్రమీలా! నువ్వు ఆడపిల్లల్ని కనడం అది నీ దోషం కాదు, అంటే ఎంత బాగుణ్ను.

ఆమెకు ఆపుకన్నా, ఆపుకోలేనంత ఏడుపు పెళ్ళగించుకొని వస్తోంది. తన బాల్యంనాటి మధురమైన రోజులు గుర్తుకువచ్చాయి. బడి పంతులయిన తన తండ్రి ఏర్పరచిన విశాల పరిధిలో పెంచబడిన తను ఆ బంగారు తండ్రిని పోగొట్టుకొని ఈనాడు కేవలం ఐదుగురు ఆడపిల్ల లకు విలువలేని తల్లిగా మాత్రమే మిగిలిపోయింది. కాలంమీద కసితో ఆమె ఎండిపోయిన కళ్ళు ఏడుస్తున్నాయి.

* * * *

ప్రమీలకు నొప్పులొస్తున్నాయి. ఆమె మనసూ నొప్పులు పడు తోంది.

"ఈసారి ఆడపిల్ల పుడితే....అమ్మో!"

తోటి ఆడదయిన అత్తగారి సాధింపులూ, తోటి వయస్కులయిన ఆడబిడ్డల వ్యంగ్యోక్తులూ, తన బాధలో భాగం పంచుకోవాల్సిన తన భర్త అలకలూ, దెప్పిపొడుపులూ....

'వద్దు....వద్దు....ఆ నరకం నాకొద్దు. ఇక వాటిని భరించేశక్తి నాలో లేదు.'

'ఇక ఈసారి ఆడపిల్లను కంటే మాత్రం, మావాడికి మళ్ళీ పెళ్ళి చేసేస్తాం మీనాక్షమ్మా'

"వంశమో పాడో! ఈసారి ఆడపిల్లను కంటే మాత్రం ఈ గడప తొక్కనిచ్చేదిలేదు."

"ఉహూ... ఉహూ....తను మగపిల్లాడినే కనాలి. మగపిల్లాడినే కనాలి!" ఆమె మనసుపడే నొప్పులకు ఓర్చుకునే శక్తిలేని ప్రమీలకు శోషవస్తోంది.

....కెవ్వుమంది బిడ్డ. కళ్ళు తెరిచింది ప్రమీల.

"....ఏం బిడ్డ?" నర్సు జవాబు చెప్పలేదు-పాపను తల్లినుండి విడదీసి ప్రక్కన మరో చిన్న బల్లమీద పడుకోబెట్టి, తల్లికి చీరతేను బయట కెళ్ళింది. భయం భయంగా ప్రక్కకు చూసింది ప్రమీల. తను చెయ్యిచాపితే అందేంత దూరంలో తన శిశువు. వణికే గుండెలతో ఆ బిడ్డవైపు క్షణం చూసింది.

పాలు కారుతున్నట్టున్న బుగ్గలవైపు చూసింది. అవి....అవి ఆడ పిల్ల బుగ్గలా? మగపిల్లాడి బుగ్గలా? తెరుచుకుంటూ, మూసుకుంటూ వున్న చిన్న చిన్న గుండ్రటి కళ్ళవైపు చూసింది. అవి....అవి ఆడపిల్ల కళ్ళా? మగపిల్లాడి కళ్ళా? ఆ లేత తలవైపు చూసింది. అది....అది.... ఆ ఒత్తయిన జుట్టు....అది....అది....ఆడపిల్ల జుట్టే....ఆడపిల్లజుట్టే....

వణికే చేతుల్తో, అదిరే గుండెల్తో పాపమీద కప్పిన గుడ్డ లాగే సింది ప్రమీల.

ఆడపిల్ల—

ఆమె మరి ఆలోచించలేదు. తను నెలరోజులుగా దాచుకుంటున్న గార్డినాల్ మాత్రల ప్యాకెట్, తను జాకెట్‌లో దాచుకున్న పర్సులో నుంచి తీసింది. చుట్టూ చూసింది. నర్సు చీరతో వస్తోంది.

"సిస్టర్ కాస్త గ్లాసుతో మంచినీళ్ళిస్తారా?"

నర్స్ నీళ్ళిచ్చి, దూది తెచ్చుకోవడానికి ప్రక్కగదిలో కెళ్ళింది. బ్రతుకుమీద ఎలాటి అనురక్తి మిగలని ఆమె చాలాతేలిగ్గా, ఆ మాత్రలు మింగేసింది. ఆమెకు చాలా నిశ్చింతగా వుందిప్పుడు. తన ప్రయత్నం ఇలా ఏ ఆటంకమూ లేకుండా కొనసాగినందుకు సంతోషంగా, కళ్ళు మూసుకుని పడుకున్న ప్రమీల తను చేసిన పనిని, నర్స్ గమనించడం చూడలేదు.

★ ★ ★ ★

"చూసావా! మన ప్రమీల ఎంత పనిచేసిందో చూసావా?" హడావిడిగా పరుగెట్టుకొచ్చిన భర్తవంక ఏమిటన్నట్టు చూసింది వర్ధనమ్మ.

"ఆడపిల్ల పుట్టిందని నిద్రమాత్రలు మింగిందట. ప్రమీల అన్న ఫోన్ చేసాడు"

"ఆడపిల్ల పుట్టిందా?" నీరసంగా కూలబడ్డ భార్యవంక చిరాగ్గా చూశాడు రాఘవయ్య.

"ఆడపిల్లే పుట్టింది, నిద్రమాత్రలు మింగింది" తన భార్య వాక్యంలోని రెండో భాగం వినలేదేమోనని మరొక్కసారి అన్నారాయన.

"ఇదొకటా? అప్రతిష్ట. ఆడపిల్లను కనటమేకాక!" రాఘవయ్యకు ఇక మాట్లాడడానికి ఏమీ మిగల్లేదు. అలాటి భార్యతో మరి మాట్లాడాలన్పించలేదు.

"లోకంలో అందరిలో అంతా మంచితనమే వుండదు. కానీ ఇంత దానవత్వమా?" ఘోషిస్తున్న మనసుతో వెనక్కు తిరిగిన ఆయన్ను వర్ధనమ్మ పిలిచింది. ఆయన ఆగారు. తన భార్యలో కొద్దిగా అయినా పశ్చాత్తాపం కలుగకపోతుందా? అనే ఆశతో ఆగారు.

"నాకు ఓపిక లేదుగానీ, మీరెళ్ళి చూసేసిరండి. పోకపోతే నలుగురూ నానామాటలూ అంటారు. నాకు ఒంట్లో బాగలేదని చెప్పండి"

నిట్టూర్చి కటిలారాయన.

★ ★ ★ ★

తన పెదనాయన కోడలి అన్నదమ్ముడి భార్యకు గర్భంపోతే విచారించడానికి వెళ్ళి వచ్చిన వర్ధనమ్మకు తన కొడుకు గదిలోనుండి మిట్ట మధ్యాహ్నం కిలకిలలు వినిపించాయి.

"ఎంత ధైర్యం! నా పర్మిషన్ లేకుండా భార్యను తీసుకొచ్చుకుంటాడా?"

తలుపు సందులో నుంచి ఆతృతగా చూసిన ఆమెకు కనబడిన దృశ్యానికి ఆమె అదిరి పడింది. తలుపులు దబదబ బాదింది. తెరుచుకున్న తలుపులగుండా చీపురుకట్ట పట్టుకుని తల వంచుకుని వెళ్ళిపోయింది ఆ ఇంట్లో పనిచేస్తున్న రత్తాలు, లోపల ధైర్యంగా పడుకున్నాడు కొడుకు.

ఆమె కొడుకుని క్షమించింది, రత్తాలును కేకేసింది.

"ఏమిటే నువ్వు చేసినపని?" రత్తాలు మాట్లాడలేదు. తల వంచుకునే వుంది.

"ఆడజన్మ ఎత్తావు. సిగ్గూ, ఎగ్గూ లేదూ?" పెళ్ళికావల్సిన పిల్లవు కావూ?"

రత్తాలు మాట్లాడలేదు. తల వంచుకుని వుంది.

"కడజాతి బుద్ధులు ఎక్కడికి పోతాయి? పో.... ఫో ఈ ఇంట్లో నువ్వు పనిచెయ్యటల్లేదు వెళ్ళిపో."

రత్తాలు మాట్లాడలేదు. తలవంచుకునే వుంది.

"వర్ధనా! ఇలారా" ప్రక్క గదిలో నుండి భార్యను కేకేసారు రాఘవయ్య.

"చూశారా చూశారా. దీని జాణతనం...."

"నేనంతా వింటూనే వున్నాను రత్తాల్నిలా పిలు...."

"ఆఁ పిలుస్తా. మీరేగా మీ స్నేహితుడు రికమెండ్ చేసాడని పెట్టింది. మీరే పంపించుకోండి" రుసరుసలాడుతూ వెళ్ళిన వర్ధనమ్మతో రత్తాలు తల వంచుకుని నడిచి వచ్చింది.

"రత్తాలూ, వెళ్ళి నీపని చూసుకో"

నివ్వెర పోయింది వర్ధనమ్మ. క్షణం తర్వాత నివ్వెర పాటు నుంచి తేరుకొని భర్తతో తలపడింది.

"చెడిపోయినదాన్ని సమర్ధిస్తున్నారన్నమాట."

"ఎవరు చెడి పోయింది.

"ఇంకెవరు?"

"అయితే నీ కొడుకు చెడిపోలేదా?"

"వాడు మగాడు"

నవ్వాడు రాఘవయ్య ఆ జవాబు వచ్చింది ఒక ఆడదాని నోటి వెంట !

భర్త ప్రవర్తనకు ఆమె మండిపోయింది.

"ఒక చెడిపోయినదాన్ని క్షమించేయడం చాలాగొప్ప అనుకుంటున్నారు కాబోలు."

అతను శాసించడమేగాని శాసించబడడం తెలీని భార్య కళ్ళ వంక నిశితంగా చూశాడు. నిదానంగా అన్నాడు-

"వర్ధనా! ఒకవేళ చెడిపోయినవాళ్ళని క్షమించడంలో గొప్పతనమే వుంటే....నిన్ను ముప్పైఏళ్ళుగా క్షమిస్తూనే వచ్చిన నేను ఏనాడో గొప్పవాణ్ని అయినట్లే!"

ఉలిక్కి పడింది వర్ధనమ్మ. ఆ షాక్‌నుంచి కోలుకోవడానికి చాలా సేపే పట్టిందామెకు.

"ఏమంటున్నారు మీరు...." పరాయి మగాడిని కన్నెత్తి చూడని ఆమెకిది నిజంగా పెద్దషాక్.

"వర్ధనా! చెడిపోవడమంటే ఉద్దేశ్యం రత్తాలుచేసిన పని అనికాదు. ఒకవేళ ఈనాడు రత్తాలు శరీరం మలినమయ్యుండొచ్చు. కానీ, నీ మనసు మలినపడలేదూ? నీ కోడలిని, నీ కొడుకు భార్యను, నీ సాధింపులకు భయపడి నిద్రమాత్రలు మింగి తన జీవితాన్ని పరిసమాప్తం చేసుకోవడానికి సిద్ధపడ్డ ఓ ఆడపిల్లను ఆదరించి కడుపులో దాచుకోలేని నీ మనసు పరిశుభ్రంగా వుందంటావా? చెప్పు వర్ధనా."

"నేనేం నిద్రమాత్రలు మింగమన్నానా?" గొణిగింది వర్ధనమ్మ.

"లేదు. నువ్వు నోటితో చెప్పలేదు. నీ ప్రవర్తన ఆమెనా పనికి పురికొల్పింది, అన్నలు, అక్కలు, అమ్మ, నాన్న అంతా వున్న ప్రమీల ఎందుకాపని చేసిందంటావ్? భర్తను, అత్తగారింటిని వదిలి పెడితే నిశ్చింతగా ఈలోకం బ్రతకనివ్వదని తెలిసి, నీ ఇంటికొచ్చి, సాధింపులు భరిస్తూ బ్రతకలేక—మరో గత్యంతరంలేక ఆ పని చేసిందా పిల్ల. ఒక ఆడపిల్లకు బ్రతికే మార్గాన్ని మూసేసిన నీ స్త్రీత్వాన్ని క్షమించిన నేను గొప్పవాడినే నంటావా? చెప్పు వర్ధనా?"

ఆమె దానికి జవాబు చెప్పలేదు.

"మీ ఉద్దేశ మేమిటి? ఆ వ్యభిచారపు ముండతో నన్ను పోలుస్తున్నారా!" వర్ధనమ్మకు కళ్ళ నీళ్ళొచ్చాయి.

"లేదు, లేదు వర్ధనా, రత్తాలుతో నిన్ను పోల్చడం లేదు. ఆ చెడిపోయింది-అనే విశేషణం రత్తాలుకు నువ్వు కలిపితే, నే నాలోచిస్తున్నాను. చెడిపోవడ మంటే ఏమిటి?" అని.

"రత్తాలు తప్పు చేసింది తరిమేయండి" అని నువ్వంటే "తప్పంటే ఏమిటి?" అని ఆలోచిస్తున్నానంతే...."

"నే నొప్పుకుంటాను. రత్తాలు ఈ రోజు తప్పుచేసింది. కేవలం ఓ రూపాయికోసమో, లేక పదహారేళ్ళ వయస్సు తాలూకు ఆసక్తితోనో తప్పు చేసింది. దాని వల్ల నష్టపోయిందెవరయినా వుంటే, అది ఎక్కువ భాగం రత్తాలే. కాకపోతే తెలిస్తే, మన ప్రమీలా బాధపడ వచ్చు కానీ ఆలోచించు వర్ధనీ. ప్రమీలలాంటి వాళ్ళ జీవితాల తాలూకు పూర్తి సుఖాల్ని, శాంతినీ దోచుకుంటున్న మీలాంటి వాళ్ళను ఈ సమాజము బహిష్కరించాలా? లేక రత్తాల్ని ఈ ఇంట్లో నుండి తరిమేయాలా? చెప్పు వర్థనీ, ఏది ముందు చేయాలి?"

"ఇన్నాళ్ళకు ....ఇన్నాళ్ళకు, ఆ చెడిపోయిన దాని మూలంగా నన్నెన్ని మాటలంటున్నారు!"

వర్థనమ్మ ఏడుస్తోంది.

తను చెప్పేది అర్ధం చేసుకోవడానికి కూడా ప్రయత్నించని భార్యను విసుగ్గా చూసారాయన.

వెంటనే ముప్ఫై ఏళ్ళ జీవిత భాగస్వామి కన్నీళ్ళకు కుమిలి పోకుండా వుండలేకపోయారు.

"ఏడవకు వర్థనా! ఈసారికి ఆ పిల్లను క్షమించేసెయ్."

చివ్వున తలెత్తింది వర్ధనమ్మ.

"మీరు చాలా గొప్పోళ్ళు. తప్పు చేసిన వాళ్ళను, మనకెంత అన్యాయం జరుగుతున్నా క్షమించగల ఉదారులు. ఆ పిల్లను క్షమించుకుంటారో ఆదరించుకుంటారో అది మీ యిష్టం."

విసురుగా వెళ్ళబోతున్న భార్య చెయ్యి పట్టుకున్నాడాయన.

"వెళ్ళకు కూర్చో వర్ధనా....! అన్యాయం అన్నావు నువ్వు ఆ పిల్ల చేసిన పనివల్ల ఇప్పుడు ఎవరికి అన్యాయం జరుగుతోంది చెప్పు? ఒకవేళ మన ప్రమీల హక్కుల్నీ, ఆనందాన్నీ ఈ పిల్ల దోచుకుంటోం దని నువ్వు బాధపడుతోంటే....నాకు సంతోషమే. అప్పుడు నేనూ నీతో ఏకీభవిస్తాను. కానీ నువ్వు అప్పుడే నీ కొడుక్కి మరో పెళ్ళి చేయడానికి సిద్ధంగా వున్నావు. ఇంకా అన్యాయమని బాధపడితే అది నవ్వుకోవాల్సిన విషయమైపోతుంది."

అసహనంగా కుర్చీలో కదిలింది వర్ధనమ్మ.

రాఘవయ్య నాలుగు అడుగులు ముందుకేసి భార్య కూర్చున్న కుర్చీ దగ్గరకొచ్చి బల్లకానుకుని నిల్చున్నాడు.

"ఒకరోజు మీ చంద్రం అన్నయ్య....అదే మీ పెద్దమ్మ కొడుకు వాళ్ళ నాన్నను....ఏ పనీ చేసుకోవడానికి శక్తిలేని వయస్సులో వున్న వాళ్ళ నాన్నను ఇంట్లో నుండి తరిమేస్తే, నువ్వాయన చెయ్యి పట్టుకుని "మా ఇంట్లో వుందువుగాని రా పెదనాన్నా" అని తీసుకొచ్చావు. ఆ పని మమకారంతో చేశావో, మానవత్వంతో చేశావో నాకు తెలీదుగానీ, వర్ధనా! ఆ రోజు నిన్ను తలచుకుని నేను చాలా గర్వపడ్డాను. ఆయ నిప్పుడికలేరు. ఇదంతా నేనెందుకు చెపుతున్నానంటే....అలాటి మీ చంద్రం అన్నయ్యను నువ్వు క్షమించావు....మనింటికి వచ్చే అధికారం అతనికి నువ్విచ్చావు....నా దృష్టిలో రత్తాలు చేసిన తప్పుకంటే చంద్రం చేసిన తప్పు చిన్నదేం కాదు. ఇలాంటి ఉదాహరణలు మన ఘనమైన వంశవృక్షంలో ఎన్నో చెప్పగలను. కానీ నువ్వు వినిపించుకునే స్థితిలో లేవు.

కానీ ఒక్కటి ఆలోచించు. నీ వల్ల, నీ కోడలికీ, చంద్రంవల్ల చంద్రం తండ్రికీ తగిలిన దెబ్బకంటే, రత్తాలు వల్ల మనకు తగిలిన దెబ్బ పెద్దదంటావా?"

వర్ధనమ్మ దగ్గర నుంచి జవాబు రాలేదు కానీ, వెక్కిళ్ళ శబ్దం మాత్రం విన్పించింది

"వర్ధనా! ఏడవకు, నిన్ను నువ్వు పరిశీలించుకో....ఇకనైనా మారడానికి ప్రయత్నించు ప్రమీలను పిలిపించు. నీ ఆస్థికోసం భార్యను వదిలేసిన కిరాతకుడిగా నీ కొడుకును మిగలనీకు."

"అంతవరకు ఆ పని ముండను పంపరన్నమాట" వెక్కుతూనే అంది వర్ధనమ్మ.

తన భార్యలో కొద్దిగా నైనా పశ్చాత్తాపం కలుగుతుందని ఆశించిన రాఘవయ్య నిరాశపడ్డాడు. ఇక అక్కడ నిల్చోలేక నీరసంగా కదిలాడు.

"పంపుతాను వర్ధనా! తల్లీ! నువ్వు చేసిన పనివల్ల నువ్వు పొందే దానికంటే పోగొట్టుకొనేదే ఎక్కువ. ఇంకిలాంటి పొరపాటు చేసి నీ బంగారంలాటి భవిష్యత్తును ముక్కలు చేసుకోకు. నీ శాంతిని నువ్వే దోచుకోకు" అని చెప్పి చూస్తాను. వినకపోతే, ఆమె తల్లిదండ్రులకు ఆ అమాయక పిల్లను అప్పచెప్పుతాను. ఆ బాధ్యత నాది."

అలా అనేసి సర్దుకుని తన కుర్చీలో కూర్చోబోతూ తలెత్తిన రాఘవయ్యకు, అక్కడ తన భార్య కన్పించలేదు.

*